# చికాగో

## ( హాస్య నాటిక )

-శంకరమంచి పార్థసారథి

### ఇందులోని పాత్రలు

| | | | |
|---|---|---|---|
| 1. | గోపాలాచార్యులు | - | వయస్సు 50 సం॥ |
| 2. | నారాయణ భట్టు | - | 40 సం॥ |
| 3. | అవతారం | - | 30 సం ॥ |
| 4. | ప్రజాపతిరావు | - | 30 సం ॥ |
| 5. | అంభారావు | - | 35 సం ॥ |
| 6. | వెంకట్రావు | - | 50 సం ॥లు |

# చికాగో

## ( హాస్య నాటిక )

-శంకరమంచి పార్థసారథి

(తెర తొలుగుతుంది. గోడలకు " వైద్య సింహం " డా ॥ గోపాలా చార్యులు అన్న బోర్డు, " ఆరోగ్యమే మహా భాగ్యం " అన్న బోర్డు " పొగత్రాగరాదు " అన్న బోర్డు, దయచేసి కూర్చోండి " అన్న బోర్డు " నిశ్శబ్దం " అన్న బోర్డు మొదలైనవి వ్రేలాడుతుంటాయి. కుడి ప్రక్కగా ఒక పొడుగుబల్ల, దానికి కాస్త దూరంలో ఒక టేబుల్, కుర్చీ వుంటాయి. టేబుల్ మీద సన్నికల్లు ( మందులు నూరేది ) పత్రం వుంటాయి. గోడలకు దేశనాయకుల ఫోటోలు కూడా ఉంటాయి. గోపాలాచార్యులు టేబిల్ ముందు కూర్చొని మందులు నూరుతూ వుంటాడు. అవతారం ఎడమవైపు ద్వారం నుంచి ప్రవేశిస్తూ...)

అవతారం : ఈ ఇల్లు అద్దెక్వివబడును. మూడు గదులు ముచ్చటైన ఇల్లు. ఫ్యామీలీలకు ప్రాముఖ్యత కలదు. వివరములకు బ్రోకరు శ్రీ అవతారాన్ని సంప్రదించడండి. దొరుకు స్థలము ఉదయం. ఇంటి నెం : ఏడు, ఏడుకొండల వారి వీధి, సాయంత్రం ప్రభుత్వసారాయి దుకాణం, గాంధీ బొమ్మ వెనుక ( అనుకుంటూ స్టేజీ ) మధ్యకి వచ్చి, అప్పుడు డాక్టరుని చూసి ) దండాలండి.

గోపాలాచార్యులు : ( తలెత్తకుండానే ) ఏరా ! తగులడ్డావా ! ఒక్కడివే వచ్చావా ? ఎవరినైనా పట్టుకొచ్చావా ?

అవతారం : బాబూ ! నేను ఇళ్ళ బ్రోకరునే గాని, డాక్టర్లుకి పేషెంట్లని తెచ్చే బ్రోకరుగాడిని కానండీ !

గోపాలా : నీ పిండాకూడు ! నేనడుగుతున్నది ఇంటి గురించే. అయినా నీకీ మధ్య కాస్త పైత్యం ఎక్కువయింది. " పూరపిచ్చుక లేహ్యం " నీ క్కాబట్టి కాస్త చవగ్గా ఇస్తాను. తీసుకుని మూడు పూటలా మింగి తగలడు.

అవతారం : బాబూ ! బతుకుమీద ఇంకాస్త ఆశ తగలడిందండీ ! అది పోయేక మీవద్ద

మందు పుచ్చుకుంటానండీ !

గోపాలా : “ వైద్యోనారాయణోహరి: ” అన్నారు.  అంటే వైద్యం  చేసేవాడు దేవుడితో సమానం అని  అయినా పిసినారి  వెధవ్వి, నా వైద్యం గురించి  నీకేం తెల్సు ?

అవతారం : భలేవారండీ ! నాకు తెలీకపోవడమేంటండీ ! నిన్న కాక  మొన్న కడుపునొప్పని ఆడెవడో  వస్తే,  చూర్ణమిచ్చి  తినమన్నారా !  పిచ్చిముండాకొడుకు  – నమ్మకం కొద్దీ ఉప్మా తిన్నట్టు మొత్తం తిన్నాడు. అంతే ! ఆ రాత్రికే  పెద్దాసుపత్రిలో చేరి, పెద్దాపరేషన్  చేయించున్నాడు.  అప్పుడు డాక్టర్లు వాడి కడుపు నిలువునా కోసి, అక్కడ చదువుకునే కుర్రాళ్ళకి ఇవి పెద్ద పేగులు, ఇవి చిన్న పేగుల, ఇదిగిదిగో కాలేయం, అది గదిగో పిత్తాశయం అని చూపించారంటండీ !

గోపాలా : చూశావా మరి ! దేశం వైద్య శాస్త్రంలో ముందుకు పోవటానికి నేనెలా సహాయం చేస్తున్నానో ! అద్సరే, అలా నిలబడి చచ్చుకబుర్లు చెప్పే బదులు, ఇలా వచ్చి చూర్ణం నూరి పెట్టకూడదూ ?

అవతారం : అది మాత్రం నావల్ల కాదండీ ! ఒకసారిలాగే  బలవంతాన  నూరించారు, జబ్బలు  పట్టుకుపోయాయి. నాల్గురోజులు జబ్బు మనిషిలా మంచానడ్డాను, దాంతో ఇళ్ళు కావాల్సిన పబ్లిక్కు , అడ్వాన్సు ఇచ్చిన పబ్లిక్కు, నేకనబడక అల్లాడిపోయారు. చివరికి పోలీసు వారి సహాయం గూడా పొందాలనుకున్నారట. మళ్ళీ మంచంలో పడెయ్యకండి బాబూ !

గోపాలా : వెధవ కబుర్లు చెప్పటానికి తప్ప  మరెందుకూ  పనికిరావు...

అవతారం : అలా అంటేనే మీ మందు తిన్నంత బాధగా అనిపిస్తుంది.  అసలేంటండీ !  నా గురించి మీకేం తెల్సని !  విష్ణుమూర్తుల వారు నన్ను పిల్చిరేయ్ అబ్బీ !  భూలోకంలో ప్రజలంతా ఇళ్ళు దొరక్క నానా అవస్థలు పడుతుంటారు.  ప్రభుత్వం  ఉంటుంది గాని అది ప్రజల గురించి  పట్టించుకోదు అంచేత నువ్వెళ్ళి ఆళ్ళకి కొంపలు చూపించి సేవ చేసుకోమన్నాడు తెల్సునా ?

గోపాలా : అవతార మూర్తీ ! నీ పోచుకోలు కబుర్లు ఆపి విషయంలోకి రా ! ప్రక్క ఇల్లు ఖాళీ అయ్యిపదిహేను రోజులవుతోంది. ఎవర్నన్నా  చూశావా ?

అవతారం : చూశానండీ ! ఫస్టుక్లాస్ పిచ్చిముండా కొడుకుని పట్టానండి. భలే కేసులేండి...

గోపాలా : కేసా ! కేసేవిట్రా నీ పిండాకూడు !

అవతారం : కంగారుపడకండి – బ్రోకరు వాళ్ళకి కూడెట్టేది కేసులేగదండి. ఇళ్ళు చూపించే బ్రోకర్లు, అమ్మాయిల్ని చూపించే బ్రోకర్లు, కాలేజీలో సీట్లిప్పించే బ్రోకర్లు, ప్రభుత్వం తరపు బ్రోకర్లు ఈళ్ళని ఎమ్.ఎల్.ఎ.లంటార్లేండి. అసలిది రాకెట్ల యుగం, బ్రోకర్ల యుగమే గదండి !

గోపాలా : రేయ్ ! నువ్విలాగే వాగుతూంటే కుంభకర్ణ గుళిక ఒకటి నోట్లో పడేసి చారెడు నీళ్ళు పోస్తా. రోగం కుదిరి, చాప చుట్టలా రెండు గంటలు పడుంటావ్ – అసలు విషయం చెప్పు !

అవతారం : ఆబాబూ ! ఆపని మాత్రం చెయ్యకండి ! అసలే ప్రొద్దుటి నించి కడుపులో తిప్పుతోంది.

గోపాలా : అద్దంలో మొహం గానీ చూసుకున్నావా ! నాప వెధవ ! త్వరగా విషయం చెప్పి అవతలికి తగలడు. ఎవరో ఇంటికోసం వచ్చారన్నావ్ ! పేరేమిటి .

అవతారం : పేరు... పేరు ఏదో చెప్పారండి ..నారాయణ...నారాయణ... నారాయణ బొట్టండి !

గోపాలా : నారాయణ బొట్టేమిట్రా నీ పిండాకూడు. తెలుగు వాడేనా ?

అవతారం : తెలుగోడేనండీ. ఆయన నాటకాలేస్తాడంటండి. అదే ఉద్యోగమంట.

గోపాలా : ఏమిటి ? నాటకాలవాడా ! మంచి వాడినే పట్టుకొచ్చావ్ !

అవతారం : నాటకాలంటే మామూలు చందమామ, మల్లెపూవు బాపతుకాదండి రాముడు, కృష్ణుడు వేస్తారు. అవేం నాటకాలండి. అదే బాబూ పదింటికి మొదలెట్టి పాలవ్యాన్ వచ్చే వరకూ ఆడ్తారు.

గోపాలా : ఓ ! పౌరాణికాలా ?

అవతారం : ఆ..అదండి ! ఆరు ఆ నాటకాలేస్తారంటండి !

గోపాలా : ఈ నాటకాలవాడు మనకెందుకయ్యా ! పొమ్మను. రేపు అద్దెకుదిగి నాటకాలని ఇంటికి తాళం పెట్టి, రెండు నెల్లు కన్పించకుండాపోతే ఆ ఓనరు – ఏది ? అసలువాడు బొంబాయినించి బాంబులావచ్చి, నిన్ను, నన్నూ మక్కెలిరగతంతాడు. తెల్సా ?

అవతారం : అవును బాబూ, అడుగుదామనుకుంటూనే మర్చిపోతున్నాను. అసలు ఓనరు బొంబాయిలో ఏం చేస్తారండీ ?

గోపాలా : ఆయన బొంబాబయిలో బిచ్చం ఎత్తుకుంటాడు. నీ కెందుకవన్నీ కొంపదీసి ఎక్కడన్నా కూసేవా?

అవతారం : ఏవనండీ ?

గోపాలా : అదేనయ్యా ! నేనసలు ఓనర్ని కాదని, అసలువాడు బొంబాయిలో వుంటాడని.

అవతారం : భలేవారండీ ! అసలు ఓనరు బొంబాయిలో వుంటే నాకెందుకు ? బందర్లో వుంటే నాకెందుకు. అయినా ప్రజాసేవ చేసుకునే మనలాంటోళ్ళకి అనేక చరిత్రలుంటాయి. అవన్నీ చెప్పేసుకుంటామేంటండీ ?

గోపాలా : నోరుకుట్టేస్తా జాగ్రత్త. నేను ఈ ఇంటి యజమాన్ని కాదనిగాని, అసలాయన బొంబాయిలో వుంటాడనిగానీ, ఆయన పేరు వెంకట్రావని గాని, ఆయనిమ్మనట్లు కాక, నేనేదో మధ్యలో కక్కుర్తి పడుతున్నాననిగాని, ఎక్కడన్నా కూసినట్లు తెలిసిందో – కుంభకర్ణగుళికలు బఠానీల్లా తినిపిస్తా ! .జాగ్రత్త

అవతారం : అయ్యబాబోయ్ ! చాలా విషయాలు చెప్పారండి కానీ – నేనేం విన్లేదండి – ఒట్టూ....

గోపాలా : వెళ్ళు – వెళ్ళు –వెళ్ళి త్వరగా ఆ నాటకాల రాయుణ్ణి పట్టుకురా – నాకు మళ్ళీ బయటికి వెళ్ళాల్సినపనుంది.

అవతారం : లగెత్తుకెళ్ళి ఆడిని తోలుకొస్తానండి – ఆ తాళంచెవులు గూడా పారెయ్యండి. ఏకంగా ఇల్లు చూపించి తీసుకువస్తా ! ఇదిగో బాబూ ! నాకు రెండు నెలల అద్దె ఫీజుగా చెబుతా – మీరు గూడా గట్టిగా చెప్పాలి.

గోపాలా : ( తాళం చెవి అందిస్తూ ) నువ్వు నాకేం చెప్పనక్కర్లేదు, కానీ నీదే నాకనుమానం. అసలే నీకు వాగుడెక్కువ. నీ మాటల్లో నిజం చెప్పేస్తే, వచ్చేవాళ్ళు మనల్ని లక్ష్యపెట్టరు. జాగ్రత్త.

అవతారం : ఏంటి బాబూ ! మరీ అంతగా ఇదైపోతారు ?

గోపాలా : నా మాట గుర్తుంచుకో ! ఒకవేళ నువ్వెప్పుడన్నా మూడో మనిషి ముందు అనవసరంగా, ఎక్కువగా, పైత్యంగా మాట్లాడుతున్నావనుకో ! అపుడు నేను చికాగో అంటాను, వెంటనే నువ్వు నోట్లో మాత్ర పడ్డట్టు ఠప్పున నోరు మూసెయ్యాలి తెల్సిందా ?

అవతారం : " చికాగో " నా ! అదేంటి బాబూ – మందుపేరా ? మనిషిపేరా ?

గోపాలా : మందూ కాదూ, నీ బొందాకాదు, అది నీకు గుర్తు తెల్సిందా ! చికాకు, గో – అనే రెండు మాత్రలని అల్లోపతి ఆయుర్వేదం కలిపినట్లు ఒకటిగా చేస్తే " చికాగో " అయ్యింది. అర్ధమయిందా ?

అవతారం : మీ మందుల్లాగే మాటలుకూడా ఇచిత్రంగా వుంటాయండీ !

గోపాలా : ఏమనుకున్నావోయ్ మరి ! నేనెక్కడయినా, ఎప్పుడయినా ' చికాగో ' అన్నానో – నువ్వు వెంటనే, అర్జంటుగా నోరు మూసెయ్యాలి. తెల్సిందా ! నేను మళ్ళీ చెప్పను. గుర్తు పెట్టుకో.

అవతారం : అలాగేనండీ ! అద్సరే బాబూ...

గోపాలా : ' చికాగో '

( అంతే ! అవతారం బయటికి పరుగెత్తాడు. గోపాలాచార్యులు మళ్ళీ వెళ్ళి కుర్చీలో కూర్చొని చూర్ణాన్ని నూరుతూంటాడు. అంతలో ప్రజాపతిరావు ప్రవేశిస్తాడు. టక్ చేసుకుని ఉంటాడు )

ప్రజాపతి : గుడ్ మార్నింగ్ సార్ ....

గోపాలా : ( తలెత్తకుండానే ) మందుకోసమా ? ఇంటికోసమా ?

ప్రజాపతి : ఓహో ! మీరు వైద్యం కూడా చేస్తారన్నమాట. కానీ నే వచ్చింది ఇంటిగురించే...

గోపాలా : అయ్యో ! సమయానికి తాళం చెవికూడా లేదే ! బాబూ మీ పేరేమిటన్నారు ?

ప్రజాపతి : ప్రజాపతిరావు

గోపాలా : చూడండి ప్రజాపతిగారూ, మూడుగదుల ఇల్లు, అన్ని విధాల సౌకర్యంగా వుంటుంది. అద్దె మూడువందల యాభై మాత్రమే సాయంత్రం వస్తే ఇల్లు చూసుకోవచ్చు. ఇంతకీ ఎంత మందుంటారు ? పిల్లలెంతమంది .

ప్రజాపతి : నేనూ, నాభార్య – ఇద్దరమే, పిల్లల్లేరు. అదే మాయావిడకి పెద్ద దిగులైపోయింది. అందుకని పిల్లలుండి, సందడున్న ఇల్లు చూడమంది. కానీ చూడబోతే మీకూ పిల్లల్లేనట్లున్నారు.

గోపాలా : నా పిల్లలు పెద్దవాళ్ళు పెళ్ళిళ్ళయి అత్తవారిళ్ళకు వెళ్ళారు. ఇక మా యావిడ తీర్ధయాత్రలకని వెళ్ళింది. ఇంతకీ మీకు పెళ్ళయి ఎన్నేళ్ళయ్యింది ?

ప్రజాపతి : అయిదేళ్ళయింది. అందులో మాది లవ్ మ్యారేజి కూడాను.

గోపాలా : లవ్ మ్యారేజా ! అయితే పెళ్ళికాకుండానే పిల్లలు పుట్టాల్సింది పోయి, పెళ్ళయ్యాక కూడా లేకపోవడానికి కారణం ఏమిటబ్బా ?
( అంటూ ప్రజాపతిరావుని సమీపించి నాడి, కళ్ళు, నాలుక పరీక్ష చేసి ) ఒంట్లో వేడి కాస్త తక్కువలా అనిపిస్తోంది ఇంటికోసం వస్తే, వంటి గురించి మాట్లాడుతున్నాని మీరనుకోనంటే, నా దగ్గర మాంచి మందుంది. పుచ్చుకుంటారా ?

ప్రజాపతి : అలాగే ! ఎంతవుతుంది ?

గోపాలా : ఎంతో అవదు, భస్మము, మాత్రలు ఇస్తాను. రాత్రిపూట పడుకునే ముందు తేనెతో నెలరోజులు వాడండి. తర్వాత మీరే వచ్చి చెబుతారుగా !

ప్రజాపతి : పత్యం ఏమన్నా చేయాలా ?

గోపాలా : పత్యం అంటూ ఏమీ ఉండదు. కానీ ఉప్పు, కారం కాస్త ఎక్కువగా తింటూ ఉండండి. చల్లగాలి పీలుస్తూ చందమమాని చూడాలి. ఇంకో విషయం కేవలం నా మందుమీదనే కాకుండా మీ ప్రయత్నం మీరు చేస్తూండాలి. అదీ సంగతి.

ప్రజాపతి : అద్సరే, ఇంటి సంగతి ఏం చెప్పారుకాదు.

గోపాలా : అద్దె మూడువందల యాభై సాయంత్రం వచ్చి చూసుకోవచ్చు. అయినా చూడాల్సిన అవుసరం కూడా ఉండుదు. బ్రహ్మాండమైన పోర్షన్. ఈ అద్దెకి అంత ఇల్లు మరెక్కడా దొరకదు. అదీగాకా.

ప్రజాపతి : ఏమిటీ ?

గోపాలా : ఆ ఇల్లు చాలా మంచిది. ఆ ఇంట్లో ఉన్నవాళ్ళంతా చాలా వృద్ధిలోకి వచ్చారు. ముందు తాలూకాఫీసులో పన్జేసే చక్రపాణిగారు, గుమాస్తాగా ఉన్నప్పుడు ఇంట్లో ప్రవేశించారు. ఆయన తాసిల్దారయి, సొంత ఇల్లు కట్టుకుని మరీ వెళ్ళారు.

ప్రజాపతి : అలాగా ?

గోపాలా : తర్వాత సుబ్బరాజుగారని ఉండేవారు. ఆయన పిల్లలకోసం కథలు గట్రా రాస్తూండేవారు. ఈ ఇంట్లోకి వచ్చాక బాగా కలిసొచ్చి ‘ ఎ ’ సర్టిఫికేట్ తెలుగు సినిమాలకి మాటలు – వ్రాస్తూ కాపురాన్ని మద్రాసు మార్చారు. ఇంతకీ అడగటమే మర్చిపోయాను. మీరెక్కడ పన్జేస్తారు ?

ప్రజాపతి : ( తాపీగా ) పశువులాస్పత్రిలో

గోపాలా : ( తొట్రుపాటుతో ) దానిదేముంది. కల్సిరావాలి గాని ఎక్కడ పన్జేస్తే ఏముంది ? అంటే మీరూ వైద్యులేనన్నమాట. కాకపోతే నేను మనుషులకి, తమరు పశువులకి వైద్యం చేస్తున్నాం. అంతే తేడా ?

ప్రజాపతి : అన్నీ బాగానే ఉన్నాయ్‌గానీ, అద్దె కాస్త ఎక్కువనిపిస్తోంది !

గోపాలా : చూడండీ ! మీరేమీ ఆలోచించొద్దు, ఇద్దరం వైద్యులం. పశువులకు చేసినా, మనుషులకి చేసినా వైద్యం వైద్యమే గదండి ! మీరు ప్రక్కనుంటే కాస్త మాటా, పలుకుగా ఉంటుంది. అవసరం అయితే మందులు కూడా మార్చుకోవచ్చు.

ప్రజాపతి : సర్లేండి. మీరింతగా చెబుతున్నప్పుడు కాదనలేకపోతున్నాను. కానీ సాయంత్రం మాయావిడని కూడా తీసుకువచ్చి చూపించాక ఫైనలు చేద్దాం. ఏవంటారు ?

గోపాలా : అలాగే కానివ్వండి. పన్లోపని. ఆ అమ్మాయి నాడి కూడా చూసి మందు తయారుచెయ్యడం మొదలెడతాను.

ప్రజాపతి : సరే – వస్తానండి !

( వెళ్ళిపోతాడు. గోపాలాచార్యులు సన్నగా పాడుకుంటూ మందులు నూరుతుంటాడు. అంతలో ' అంభారావు ' పెద్ద పెద్ద అంగల్లో ప్రవేశిస్తాడు. వస్తూనే )

అంభారావు : ఎవరండి ఇంట్లో...

గోపాలా : ( అనుమానంగా చూస్తూ ) ఎవరు కావాలి ?

అంభారావు : ( మామూలు ధోరణిలో చేతిలోని కాగితాలవైపు, ఫైల్‌ని చూస్తూ ) మీ పేరేమిటి ?

గోపాలా : గోపాలాచార్యులు – ఇంతకీ తమరెవరు ?

అంభారావు : చెబుతా, చెబుతా , పెళ్ళయిందా ?

గోపాలా : ఏమిటి ? పెళ్ళయిందా ! ఏం నాయనా పెళ్ళికాని బ్రహ్మచారి వెధవలా కనిపిస్తున్నానా ?

అంభారావు : ( గొణుగుతున్నట్లుగా ) లేదు. పెళ్ళయిన సన్యాసి వెధవలా కనిపిస్తున్నారుగాని (పెద్దగా) దయచేసి అడ్డుకొట్టకండి, డ్యూటీ మీదున్నాను, ఇంతకీ పిల్లలెంతమంది ?

గోపాలా : డ్యూటీ అంటున్నావ్ ! పిల్లలెంతమంది అంటున్నావ్ ! కొంపదీసి కుటుంబనియంత్రణ తాలూకానా ?

అంభారావు: సగం నిజం, సగం అబద్ధం – నియంత్రణకాదు. సంక్షేమం అందుకే జనాన్ని లెక్కకట్టుకుంటూ ఇలా వచ్చాను.

గోపాలా : ( తేలిగ్గా ) జనాభా లెక్కలా సరే పెద్ద ఆఫీసరనుకున్నా

అంభారావు : అంత తేలిగ్గా తీసిపారెయ్యకండి నేనిచ్చే రిపోర్టు పైనే రేషన్ కార్డు వగైరాలు ఆధారపడి వుంటాయి.

గోపాలా : ( భయంగా ) అలాగా ? ఆయ్యో అలా నిల్చునే మాట్లాడుతున్నావ్ కూర్చో నాయనా !

అంభారావు : ( గర్వంగా చూస్తూ కూర్చుంటాడు )
ఇంతకీ నా ప్రశ్నకి బదులివ్వలేదు. పిల్లలూ ...!

గోపాలా : నాయనా ! నాకు నలుగురు సంతానం ....

అంభారావు : అలాగా సరే మీ భార్యని, పిల్లల్ని, పిలవండి, కంటితో చూస్తేనే గానీ ఏదీ నమ్మొద్దని ఆర్డర్స్.

గోపాలా : ( వినయంగా ) నా భార్య తీర్థయాత్రలకంటూ వెళ్ళింది. పిల్లలు ఇప్పుడే అలా బంధువులింటికెళ్ళారు. ఇంతకీ నీ పేరేమిటన్నావ్ ?

అంభారావు : అబ్బే ఇంకేం అన్లేదు.

గోపాలా : అబ్బో పెద్ద చతురిడివే. పర్లేదు చెప్పు నాయనా !

అంభారావు : నా పేరోయ్ – అంభారావు...

గోపాలా : అదేం పేరోయ్ – ఆంబోతురావులాగా !

అంభారావు : షటప్ – అంభారావంటే – అంగల భాస్కరావు – బంగారంలాగా నాలాంటి వాళ్ళు చాలా అరుదుగా లభిస్తారని. మా ఆఫీసరు గారంటూంటారు. మీరుసరే – మీ ఆవిడన పిలవండి. ఒక చూపు చూసి పోతా...

గోపాలా : ( ఆమాటా వినిపించుకోనట్లు )
ఇంతకీ మనదేవూరు.

అంభారావు : చెప్పాలంటే చరిత్ర చాలా వుంది. అయినా అడిగారు గనుక చెప్తున్నా – అంగల కుదుర్లోపుట్టి, పెద్దాపురంలో పెరిగి, చీరాల్లో చదివి, హైద్రాబాద్‌లో ఉద్యోగం సంపాదించి కొంప కొంపకి తిరుగుతూ హైరానాపడిపోతున్నా – కాస్త తెలుగుగంగ ఇప్పిస్తారా ?

గోపాలా : ( అనుమానంగా ) ఏ గంగ ?

అంభారావు : తెలుగంగ.

గోపాలా : తెలుగుగంగా ! భలేవాడివి. తెలుగుగంగ తెలుగువాడి కొంపల్లో వుంటుందా. అది ఏనాడో మాద్రాసు పోయింది.

అంభారావు : అబ్బా నాక్కావలిసింది ఒక గ్లాసుడు మంచి తీర్థం.

గోపాలా : అలా అడుగమరి..

( అంటూ లోనికెళ్ళాడు. అంభారావు ఇల్లంతా పరీక్షగా చూస్తాడు. ఏదో అర్థమైనట్లు తలూపుతాడు. అంతలో గోపాలాచార్యులు గ్లాసుతో నీళ్ళు తెచ్చాడు. అంభారావు గడగడా త్రాగి.

అంభారావు : థాంక్స్ ! – ఇహ మీ భార్యని, పిల్లల్ని పిలిపిస్తే నా పని చూసుకుపోతా ! ఇంకా తిరగవలసిని కొంపలు చాలా వున్నాయి.

గోపాలా : చెప్పాగా – నా భార్య తీర్థయాత్రలకెళ్ళింది. సమయానికి పిల్లలు గూడా లేరు. అంచేత చూసినట్లు వ్రాసుకో !

అంభారావు : ( చేతిలో వున్న ఫైలుని విసురుగా బల్లపై కొడుతూ ) ఛస్తే జరగదు. అంభారావంటే ఏమనకుంటున్నారు ? అన్యాయం, అక్రమం జరిగితే అంభా అంటూ అరుస్తాడు. రూల్సు నా ప్రాణం, డ్యూటీ నా వూపిరి.

గోపాలా : నిజమే కాని, నేను అబద్ధం ఆడటం లేదు. అబద్దాలాడటం మానేసి ఆర్నెల్లయింది. కావాలంటే ఎవరినైనా అడగండి.

అంభారావు : అనవసరం. నాక్కావాల్సింది సాక్ష్యాలు కాదు, దృశ్యం – సాక్షాత్తూ నా ముందు నిలబడాలి. అంచేత ఒంటరిగాడివని రాసేస్తున్నా.

గోపాలా : ( బ్రతిమాలుతున్నట్లుగా ) బాబ్బాబు నీకు పుణ్యం వుంటుంది.

అంభారావు : అబ్బే ఏం లాభం లేదు. అయిపోయింది. అంతా అయిపోయింది. రాసేశాను. ఏకాకిగాడివని రాశాను. అంచేత నీకు నెలకి కిలో పంచదార, కిలో కందిపప్పు, కిలో గోధుమలు, ఒక లీటరు కిర్సనాయిలు – అవునూ ఇంతకి మనకి గ్యాసుందా !

గోపాలా : ( కోపంగా ) భగవంతుడి దయవల్ల ఇంతవరకూ ఎటువంటి వాయురోగాలు లేవు.

అంభారావు : అబ్బా నేనడుగుతున్నది గ్యాస్ట్రిక్ ట్రబుల్ గురించి కాదు. గ్యాస్ – వంట గ్యాసు గురించి !

గోపాలా : దాన్ని గురించా, ఈ మధ్యనే ఎవరో నీలాంటి వాళ్ళు ఇప్పించి పుణ్యం కట్టుకున్నాడరు.

అంభారావు : అలాగా పాపం అయితే మీకు కిర్సనాయిలు గూడా కేన్సిల్.

గోపాలా : ఎందుకు ఇలా వుదయాన్నే వచ్చి వేపుకు తింటున్నావ్ ! పెద్ద వాడిని.

అంభారావు : అబ్బే అదేం కుదరదు. అంభారావంటే అల్లాటప్పా కాదు. రూల్సుకి ప్రాణం ఇచ్చేబాపతు.

గోపాలా : నీ కష్టం వుంచుకోను.

అంభారావు : షటప్, అంటే, లంచం ఇచ్చి పని చేయించుకోవాలనా ? ఛస్తే కుదర్దు, అంభారావందుకంగీకరించడు.

( అంటూ వెళ్ళిపోతాడు. గోపాలాచార్యులు అతడి చెయ్యిపట్టి , ఆపబోయి చటుక్కున ఏదో స్ఫురించిన వాడిలా, అనుమానంగా మొహం పెట్టి )

గోపాలా : నీ వయస్సెంత ?

అంభారావు : ముప్పైయి అయిదు – దేనికీ ?

( గోపాలాచార్యులు నాడిని, ఆ పైన కళ్ళని పరీక్ష చేసి )

గోపాలా : పెళ్ళయిందా ?

అంభారావు : ( అనుమానంగా ) అయింది ఏం ?

గోపాలా : అందువల్లే ఒంట్లో నెత్తురు కాస్త తక్కువగా వుంది.

అంభారావు : నాకేం అర్థం కావటం లేదు.

గోపాలా : ఉష్. ( మాట్లాడవద్దని సైగచేసి ) అలా కూర్చో.

( అంభారావు కూర్చుని వెర్రిగా చూస్తున్నాడు. గోపాలాచార్యులు కాస్సేపు పరీక్షగా చూసి )

గోపాలా : ఆకలి, కరకరాకరకరా ( అవదు గదా అన్నట్లు చెయ్యి తిప్పుతాడు )

అంభారావు : బ్రహ్మాండంగా అవుతుందే.

గోపాలా : రాత్రిళ్ళు నిద్ర...

అంభారావు : పిచ్చి నిద్ర – పడుకుంటే మెలుకువే రాదు,

గోపాలా : ( ఏదో కాస్సేపు దీర్ఘంగా ఆలోచించి ) గుండెల్లో మంట... అప్పుడప్పుడు....

అంభారావు : గుండెల్లో మంటా...

గోపాలా : అప్పుడప్పుడు సూదులు పెట్టి పొడుస్తున్నట్లు....

అంభారావు : అవునంగీ – అప్పుడప్పుడు అలానే అన్పిస్తూంటుంది. అయినా ఎందుకలా అడుగుతున్నారు ?

గోపాలా : చూడండి – ఆంబోతురావుగారూ...

అంభారావు : నా పేరు అంభారావు.

గోపాలా : ఏదో అఘోరించిన రావు గాని, మొత్తానికి భలే అదృష్టవంతుడివయ్యా.

అంభారవు : ఎందువల్ల ?

గోపాలా : ఎందుకంటే, రేషన్ కార్డు పని మీద నువ్వు నా దగ్గరకి రావటం వుంది చూశావూ – అదే పెద్ద అదృష్ట. లేకపోతే పెద్ద ఘోరం జరిగుండేది.

అంభారావు : ఏమిటండీ ! అంతా అయోమయంగా వుంది. ఇంతకీ ఏవిటి మీరనేది ?

గోపాలా : అబ్బే మరేం లేదు. గుండె కాస్త బలహీనంగా వుంది. గుండె పోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయ్....

అంభారావు : ఆ ! నిజంగానా !

గోపాలా : ఆ...నిజంగానే – ఆ వెర్రి ఆకలి, పిచ్చి నిద్ర, గుండెల్లో మంట నిశ్చయంగా అవే లక్షణాలు. సరే అదలా వుంచి నా రేషన్ కార్డు సంగతి కాస్త చూద్దురూ....

అంభారావు : మీ రేషన్ కార్డు దొంగలెత్తుకుపోను. నా గుండె గురించి చెప్పవయ్యా !

గోపాలా : చెప్పటానికేముంది ! చాలా బలహీనంగా వుంది. మందులు వాడితే ప్రయోజనం వుండొచ్చు.

అంభారావు : ( ఆత్రంగా ) మందులు మీరిస్తారుగా ఎంతవుతుంది ?

గోపాలా : నెలకో రెండొందలు చొప్పున ఒక ఏడాదన్నా గట్టిగా పుచ్చుకోవాలి. ఇంతకీ నా రేషన్ కార్డు.....

అంభారావు : అయ్యో – మీ కార్డు గురించి వర్రీ కాకండీ ! నా చేతిలో వున్న పనేగా ! మీకు ఇద్దరు పెళ్ళాలు, డజను మంది పిల్లలు అని వ్రాసేస్తాను. ఇంతకీ నా గుండె సంగతి....

గోపాలా : కానీ " రూల్సు నా ప్రాణం, డ్యూటీ నా వూపిరి " అని అన్నట్లు గుర్తు.

అంభారావు : అబ్బే ఊరికే జోక్ చేశానంతే ! వెధవ రూల్సు ఎట్లా కావాలంటే అట్లా తిప్పొచ్చు. మరి నా మందు సంగతి....

గోపాలా : మీ గుండెని ఇలా నా చేతుల్లో పెట్టి నిశ్చింతగా వుండండి...
నే రిపేరు చేస్తాగా ?

అంభారావు : ఏం ఫర్వాలేదుగా ?

గోపాలా : ఇంకా అనుమానమా ! నా వద్ద మందు పుచ్చుకుంటే ...మీరు చచ్చినా, గుండె మాత్రం కొట్టుకుంటూనే వుంటుంది.

అంభారావు : అమ్మయ్య – బ్రతికించారు. అయితే ఎప్పుడు రమ్మంటారు ?

గోపాలా : ఎల్లుండి రండి – మందు తయారుచేసి వుంచుతాను. అడ్వాన్సు ఇచ్చి మందు తీసికెళ్ళండి ! ఏవంటారు?

అంభారావు : అలాగే వస్తానండీ... ( అంటూ వెళ్ళబోతాడు )

గోపాలా : మరి నా రేషన్ కార్డూ ...!

అంభారావు : ఎల్లుండి వచ్చేటప్పుడు వెంట తెచ్చే పూచీ నాది మందు మాత్రం కాస్త శ్రద్ధగా చెయ్యండి.

( అనేసి భారంగా గుండె చేత్తో పట్టుకుని వెళ్ళిపోతాడు. అతడెళ్ళిన వైపు రెండు క్షణాలు చూసి ...)

గోపాలా : పిల్లకాకి – రూల్సట రూల్సు... అంభారావు, ఆంబోతురావునూ...అందరూ రూల్సు మాట్లాడతారుగనుకనే దేశం ఇంత గొప్పగా తగులడింది. వాడి బలహీనత వాడికుంటే, నా బలహీనత నాకుంది.

అవతారం : ( ప్రవేశిస్తూ ) బాబూ ! ఇది కూడా మొదలెట్టారన్న మాట కేసుల్ని డైరెక్టుగా చూసుకుంటూ మెల్లిగా నన్ను తప్పించేయాలన్నా మీ ఉద్దేశ్యం ? నేనేం మంచివాడ్ని కాను. తర్వాత మీ ఇష్టం.

గోపాలా : రేయ్, నీకు పిచ్చిగాని పట్టిందా ! వాడెవడో నాకేం తెల్సు ! రేషన్ కార్డు రాయటానికి వచ్చి మందు కావాలన్నాడు. అందుకు నేనేం చేసేది !

అవతారం : మరి, మందు ఇచ్చారా .

గోపాలా : అబ్బే లేదు. తయారు చెయ్యాలి. ఎల్లుండి రమ్మన్నాను. సరేనని వెళ్ళాడు.

అవతారం : నాకు తెలియకుండా ఇల్లు ఎవరికన్నా ఇచ్చారంటే బాబూ, బొంబాయి వెంకట్రావుగారి సంగతి ప్రతి ఇంటికీ వెళ్ళి తలుపు కొట్టీ మరీ చెబుతాను.

గోపాలా :నోరు మూస్తావా ! లేక మాత్ర నోట్లో పడెయ్యమంటావా ? ఎవరో వస్తున్నట్టున్నారు. చూడు...( నారాయణ భట్టు ప్రవేశించకుండానే ...)

భట్టు : మేము గృహ ప్రవేశము చేయవచ్చునా ?

అవతారం : రండి – రండి వీరేనండి డాక్టరుగారు.

గోపాలా : అంతేకాదు. ఈ యింటికి ఓనర్ని గూడాను. అలా కూర్చోండి.

భట్టు : ఓహో మీరేనా, ఈ సౌదమునకదిపతి. మాకు కదు సంతసముగా వున్నది.

అవతారం : బాబూ అలా కూర్చోండి. ( ఆచార్యులతో ) వీరేనండీ, నే చెప్పిన నారాయణబొట్టుగారు.

భట్టు : ఆపుము. ఏమీ మదియనామధేయము. నీ నోటిలో పడి మన రాజ్యాంగమువలె దాని స్వరూపమునే మార్చుకున్నది. మా నామ దేయము నారాయణభట్టు. కుంకుభట్టు సంతతి వారలము. కడు గౌరవపాత్రులము.

గోపాలా : నారాయణభట్టువా ! చంపేశారు. ( నవ్వి ) ఇంతకీ ఇల్లు చూసుకున్నారా ? ఎలా వుంది ?

భట్టు : ఇల్లు బాగానే యున్నది. కానీ గదలులే బహు ఇరుకుగా యున్నవి.

గోపాలా : ఈ మాట ఇంతవరకూ ఎవరూ అన్లేదు. మీరే అంటున్నారు. ఇంతకీ మీరేం చేస్తుంటారు ?

భట్టు : సరైన ప్రశ్న వేసితిరి. కూలిపోతున్న మన ప్రాచీన కళలని నిలబెట్టుచుందును.

అవతారం : ఏంటిబాబూ ! ఏదో నిలబెడతానంటున్నారు ?

గోపాలా : నీ పిండాకూడు ! నా పిండాకూడూను( భట్టుతో ) బాబూ తమరెంత మంది వుంటారు ?

భట్టు : మేము ఒంటరిగాళ్ళమే. కాని సాయం సమయమున మా సమాజ సభ్యులందరూ సమావేశమయ్యెదరు.

గోపాలా : అయి ఏం చేస్తారు ?

భట్టు : పిచ్చిప్రశ్న. కళాకారులందరూ, సాయం సమయమున ఏమి చేసెదరో మేమూ అదే చేసెదము. సాధన సాధన చేసెదము. మచ్చుకి ఒక పద్యము విందువా ?

అవతారం : ( ఉత్సాహంగా )వినిపించండి బాబూ !

భట్టు : ముందు వస్త్రాపహరణంతో మొదలుపెడదాము.

గోపాలా : కొంపదీసి బట్టలుగాని విప్పడు గదా ?

భట్టు : ( అభినయిస్తూ ) దుశ్శాసనా ! ఆ పాతకినిటు ఈడ్చుకు రమ్ము ...

( అన్ని పాత్రలూ తనే అభినయిస్తూ ) రావే కులటా ! ఓరీ దుశ్వాసనా ”

కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవులనేకుల్ చూచుచుండన్

గోపాలా : బాబూ ! ఇంటి సంగతి మాట్లాడి త్వరగా వెడితే మంచిది. మా ఆరోగ్యాలంతగా మంచివి కావు.

అవతారం : ఈ లెక్కన మీకు దొంగల భయం ఉండదు.

( భట్టు అభినయిస్తూ పాడుతూనే వుంటాడు )

గోపాలా : వీడెక్కడ దొరికాడయ్యా నీకు త్వరగా బయటికి పంపెయ్యి.

అవతారం : బాబూ ! ఆయన ముందుగానే సెప్పారండీ. నాదే తప్పు.

గోపాలా : ఏవని చెప్పాడు ?

అవతారం : పాతికేళ్ళనించి ఈ బాపతు నాటకాలేసి, ఏసి ఆ ధోరణి నరనరాల్లోకి ఎక్కేసిందంటండి. అంచేత కాస్త కదిపితే మూడ్స్‌లోకెళ్ళిపోతారంటండి. ఆయన పూర్తిగా మూడ్స్‌లో కెడితే కురుక్షేత్రం పూర్తిచేస్తేనేగాని, కాలు బయట పెట్టరంటండి.

గోపాలా : మరి, ఆ విషయం తెలిసి వాడినెందుకు కదిపావయ్యా ?

అవాతారం : కంగారు పడకండి, దానికి విరుగుడు కూడా సెప్పారండి !

గోపాలా : ఏవనీ !

అవతారం : ఆరి చొక్కా జేబులో ఎప్పుడూ చిన్నగటం ఉంటందండీ ! వారు పూర్తిగా మూడ్స్‌లో కెళ్ళినప్పుడు ఆ గంట తీసి చెవి దగ్గర వాయిస్తే తిరిగి మామూలు మనిషవుతారట.

గోపాలా : అదేదో త్వరగా తీసిచావు. నా చెవులు చిల్లులుపడేలా వున్నాయ్ !

అవతారం : ( భట్టుని " సార్ ", " సార్ " అని పిలుస్తాడు. కాని అతని దోరణిలో మార్పు రాకపోవటంతో ) లాభం లేదండి. వెళ్ళిపోయారు. పూర్తిగా మూడ్స్‌లో కెళ్ళిపోయారు.

గోపాలా : గంట కొడతావా ? పళ్ళు రాలగొట్టమంటావా ?

( అవతారం భట్టు జేబులో గంట తీసి చెవిదగ్గర వాయించాడు )

భట్టు : ( తలవిదిల్చి ) ఎవరో మమ్మల్ని పిలిచినట్లున్నారు ?

గోపాలా : అయ్యా ! మేమ పిల్చాం వచ్చిన పని చూసుకుని పోవాలిగాని. సమయం సందర్భం లేకుండా మూడ్స్‌లోకెళ్ళి, మమ్మల్నీ విధంగా జీవహింస పెట్టడం చాలా ధారుణం.

అవతారం : ఇంకా మా ఆచారిగారు కాబట్టి మంచిగా చెబుతున్నారు. అదే బొంబాయి ఓనరయితే...

గోపాలా : " చికాగో " ( అవతారం టక్కున మానేశాడు )

భట్టు : ఏమది, చికాగో – కడువింతగా యున్నది. దాని భావమేమి ?

అవతారం : ( భట్టుని అవతలికి తీసుకువెళ్ళి మెల్లిగా ) లోగడ డాక్టరుగారికి పిచ్చెక్కింది. పూర్తిగా తగ్గినా, ఉన్నట్టుండి పిచ్చి పిచ్చి మాటలు అరుస్తుంటారు. మీరేం పట్టించుకోకండి.

భట్టు : అటులనా ! వాడి వాలకము చూచినపుడే నాకనుమానము కలిగినది.

గోపాలా : రేయ్ – అవతారం ! నీకువాడితో రహస్యాలు, గుసగుసలు ఏమిట్రా అసలిద్దరూ బయటికి నడవండి.

అవతారం : ( భట్టుతో ) పిచ్చి ఈ రోజు కాస్త ఎక్కువైనట్లుంది. ఎందుకైనా మంచిది. మీరు కాస్త దూరంగా నిలబడండి. ( అంటూ భట్టుని కొంచెం అవతల నిలబెట్టి, ఆచారి వద్దకొచ్చి రహస్యం చెబుతున్నట్లుగా ) ఆడసలే పిచ్చిముండా కొడుకు. ఆడితో సమానంగా మీరు కేకలు, రంకెలేంటండి. ఏదో మంచి మాటలుచెప్పి బయటికి పంపిస్తాను. కాసేపు నేనేం వాగినా పట్టించుకోకండి.

గోపాలా : అదేదో త్వరగా తగలడు. లేకపోతే నాకు నిజంగానే పిచ్చెక్కేలా వుంది.

అవతారం : ( భట్టుతో ) బాబూ తవరు ఏ వేషాలు ఎక్కువగా వేస్తారు ?

భట్టు : అన్నియునూ వేసితిని. ఒక్క హనుమంతుడు తప్ప.

గోపాలా : రేయ్ – అవతారం ( ప్రక్కకు లాగి ) వాడిని త్వరగా బయటికి పంపించెయ్. లేకపోతే, ఆ వేషం కూడా ఇక్కడేవేసి ముచ్చట తీర్చుకునేలా వున్నాడు.

భట్టు : ఏమి, వాడేదో కూయుచున్నాడు.

అవతారం : ఆ పిచ్చి కూతలు పట్టించుకోకండి. అంటే బాబూ, మీరన్నీ దేవుడి వేషాలే వేస్తారన్నమాట. అయితే ఏదోనాటికి మీరూ మంత్రయిపోతారేమో ! అవును బాబూ ( భట్టు మొహం మీద మచ్చ చూసి ) మీ మొహమంత చక్కగా వుంది. కానీ మొహం మీద ఆ మచ్చ మాత్రం బాగోలేదండి. చుట్టకాల్చి పెట్టిన బాపతా ?

భట్టు : దాని వెనుక పెద్దగాథ యున్నది – చెప్పమందువా ?

అవతారం : ( ఉత్సాహంగా ) చెప్పండి – చెప్పండి బాబూ !

గోపాలా : ‘ చికాగో ’

భట్టు : వాడికి మళ్ళీ పిచ్చి రేగినట్లుంది.

అవతారం : అమావాస్య సీజను గదండీ. అలా రేగుతూనే వుంటుంది. మీరు చెప్పండి బాబూ !

గోపాలా : చికాగో, చికాగో, చికాగో !

( ఇద్దరూ తన మాటలు పట్టించుకోవటం లేదని గ్రహించి గోపాలా చార్యులు తల పట్టుకుని కుర్చీలో కూలబడతాడు )

భట్టు : మేమొకసారి సతీ సావిత్రి నాటక ప్రదర్శనపై బొంబాయి నగరమయిన కేగితిమి.

అవతారం : ఏవిటి బొంబాయి వెళ్ళారా ? అక్కడ వెంకట్రావుగారనీ....

గోపాలా : రేయ్ అవతారం, నీయమ్మ కడుపుకాలా చికాగో రా !

( అవతారం ఆచార్యుల వైపు చూసి భట్టుతో )

అవతారం : తమరు చెప్పండి బాబూ !

భట్టు : బొంబాయిలోని తెలుగువారు మమ్మల్ని సతీసావిత్రి నాటక ప్రదర్శనకై ఆహ్వానించగా తరలివెళ్ళితిమి. ఆరోజు సభాస్థలి జనసందోహముతో కిక్కిరిసిపోయినది. ఉచిత ప్రదర్శనకైననూ, అంతమంది జనం వచ్చుట మన తెలుగుదేశములో నేనెన్నడూ చూసి యుండలేదు. నాటకము మొదలైనది. ప్రేక్షకులు కడు ఉత్సాహముతో తిలకించుచుండిరి. సగమువరకు బాగుగానే జరిగినది. అందులో నేను యముండ !

అవతారం : ఏం ముండా !

భట్టు : యముండ. సత్యవంతుడు మరణించాడు. సావిత్రి రోదించసాగింది. సహజత్వము కొరకు సజీవమైన దున్న నదిరోహించి, సత్యవంతుడి ప్రాణములను గొనిపోవుటకై నేను రంగ ప్రవేశము చేసితిని. అంతలో జరిగినది.

అవతారం : ఏమైంది ! చనిపోయిన సత్యవంతుడు ఆవులిస్తూ లేచి కూర్చున్నాడా ?

భట్టు : లేదు, చనిపోయిన సత్యవంతుడు సావిత్రి ఒడిలో సుఖముగా గుర్రు పెట్టుచున్నాడు. కానీ నేనధిరోహించిన దున్నపోతు కళావేశముతో నన్ను సత్యవంతుడిపై పడవేసి, తాను ముందు కూర్చున్న మంత్రివర్యుల పైకి లంఘించినది. నేను సత్యవంతుడిపై ఒక్కసారిగా, హటాత్తుగా పడుసరికి, వాడికిపోయిన ప్రాణములు తిరిగొచ్చి నన్ను బండబూతులు తిట్టుచూ, చాచి ఎడమ డొక్కలో బలముగా తన్నినాడు. నేను వెళ్ళి సావిత్రి ఒడిలో పడితిని, ఆమె సత్యవంతుని బ్రతిమాలి, ప్రాధేయపడి నాకు ప్రాణభిక్ష పెట్టినది. అధీ కథ. దాని ఫలితమే ఈ మచ్చ.

అవతారం : అందుకే ఇటువంటి వేషాలేసేటప్పుడు ఇన్సూర్ చేయించుకోవాలి.

గోపాలా : అవతారంగా, నీకేవన్నా బుద్దుందా ! అసలిద్దరూ బయటికి నడవండి

( అంటూ ముందుకు రాబోతాడు )

అవతారం : ( తాపీగా ) అలాగే నడుస్తావండీ ! వీరికి కాస్త బొంబాయి వెంకట్రావుగారి సంగతి చెప్పి వెళ్ళిపోతా !

( ఆ మాట వినగానే, ఆచార్యులు మళ్ళీ వెళ్ళి టక్కున కుర్చీలో కూర్చుంటాడు )

భట్టు : బొంబాయి వెంకట్రావు పేరువిని, వాడేల భయపడుచున్నాడు.

అవతారం : బొంబాయి వెంకట్రావుగారి వెనుక పెద్ద కథ యున్నది. చెప్పమందురా !

( నాటక ఫక్కీలో )

భట్టు : చెప్పుము ! ఆలకించెదము.

గోపాలా : ( ఒక్క వుదుటున అవతారాన్ని సమీపించి, బ్రతిమాలుతున్న ధోరణిలో,...) నే

ఁయ్ అవతారం, చికాగోరా నీకు పుణ్యం వుంటుంది. చికాగో రా !

అవతారం : సర్లెండి, అందితే జుట్టు, లేకపోతే కాళ్ళని, బాబూ తెలివి తేటలు మాకూ వున్నాయండి. కేసుల్ని డైరెక్టుగా...

గోపాలా : ( మెల్లగా ) మన విషయాలు తాపీగా తర్వాత మాట్లాడుకుందాం. ముందు వాడిని పంపించెయ్యి.

అవతారం : అలా రండి – దారికి ( భట్టుతో ) బాబూ వెంకట్రావు గారి కథ తర్వాత చెబుతాగానీ, ముందు ఇంటి సంగతి చెప్పండి.

భట్టు : గాలీ, వెలుతురూ బాగుగా వచ్చునా ?

అవతారం : వెలుతుర్లేంటి, సూర్యుడు, చంద్రుడు ఇంట్లోనే వుంటారు. ఇహ గాలంటారా ! ఇంతకు మునుపున్న పెద్ద మనిషికి ఇక్కడి గాలి వలనే బట్టతలయింది. ఇహ మీ ఇష్టం.

గోపాలా : ఇదిగో చూడండి. అద్దె మూడు వందలయాభై. కరెంటు, నీళ్ళు, తాలూకూ ఛార్జీలు అదనంగా కట్టుకోవాలి. వీడికి రెండు నెలల అద్దె ఫీజుగా యివ్వాలి. నాకు మూడు నెలల అద్దె అడ్వాన్సు. ఇహ పోతే ....

భట్టు : ఏం పోతే. !

అవతారం : మతి. మతిపోతే మందు ఉచితముగా ఇవ్వబడును.

గోపాలా : నువ్ నోర్ముయ్. అద్దె ప్రతి నెలా మొదటి తారీఖున ఇవ్వాలి. ఫ్యానుకి 5 రూపాయలు, ఇస్త్రీ పెట్టెకి మూడు, రేడియో, టి.వి.లకు పది రూపాయలు అదనంగా చెల్లించాలి. మీరిచ్చిన అద్దెకి రశీదు ఇవ్వబడదు. టాక్సు తాలూకు మనుషులొస్తే ముప్పై అయిదు రూపాయలు మాత్రమే అద్దె ఇస్తున్నట్లుగా చెప్పాలి. ఇంకా చెప్పాలంటే...

భట్టు : ఏమిటింకా వున్నాయా ?

గోపాలా : గోడలకి మేకులు కొట్టకూడదు. రాత్రి పదిదాటాక లైటు వెయ్యకూడదు. పెద్దగా మాట్లాడకూదు. పరిసరాలు పరిశుభ్రంగా వుంచాలి.

అవతారం : ( ఆచార్యులుని చూపిస్తూ ) మీకు వైద్య సదుపాయం కూడా అందుబాటులో యుండును.

భట్టు : ఏమి ఈ షరతులు ! కడు కష్టముగా తోచుచున్నది !

అవతారం : మరి ఎవరి కష్టములు వారివి గదా !

భట్టు : అవతారం ! మరేదైనా మాట చెప్పుము..

అవతారం : పీతకష్టములు పీతవి గదా !

భట్టు : అబ్బా నేననుచున్నది అద్దె విషయంలో మరో మాట చెప్పమని.

అవతారం : డాక్టరుగారితో వ్యవహారం ఒక మాట. ఒక మాత్ర. అంతే . కావాలంటే వారినే అడగండి.

భట్టు : ఆ పిచ్చి వానితో నాకేమీ !

గోపాలా : పిచ్చి గిచ్చి అన్నావంటే పళ్ళురాలగొడతాను. ఇందాకటి నించీ చూస్తున్నాను. ఏమిటయ్యా నువ్వు మాట్లాడేది ! అసలు ఇల్లూ లేదు, గిల్లూ లేదూ. నడు బయటికి !

( భట్టు స్టేజీముందుకు వచ్చాడు. అతడి మొహంలో భావాలు మారినాయి. తనలో తాను మాట్లాడుకుంటున్నట్లుగా )

భట్టు : ఏమి ఈ అవమానము ! ఏమి ఈ అసందర్భ ప్రలాపనము ! సహజ నటనా చాతార్యంతో, హావభావములకు పెట్టిన పేరుగలవాడనై, పౌరాణిక చారిత్రక జానపద పాత్రలతో పండిపోయిన, ఈ నవరసనటబంటు, నారాయణ భట్టుకా ఈ అవమానము, అగౌరవమ. సహింపరానిది. ఈ అవమానము అగౌరవము సహించుటకన్నా మరణమే మిన్న. నాకు మరణమే శరణ్యము.

( భట్టు మాట్లాడుతున్నట్లుగా పెదవుల కంపిస్తూ అభినయిస్తూండగా )

అవతారం : కొంపదీశారు గదండీ !

గోపాలా : ఏమైందయ్యా ?

అవతారం : ఆయన మనస్సుకి నొప్పి కల్గిస్తే మూడ్‌లోకెళ్ళిపోతారండి.

గోపాలా : ఆ విషయం ఇప్పుడా చెప్పేది. అయినా కాళ్ళు, చేతులూ పట్టి బయటికి లాగేద్దాం.

అవతారం : మీరూరుకోండి. ( అని భట్టుని సమీపించి ) బాబూ భట్టుగారూ భట్టు గారూ !

భట్టు : కర్ణా ! విన్నావా, నా యీ అవమానపు విశేషణములు. సార్వభౌముడనిపించుకున్న నేను, ఈ అవమానముతో ఎటుల జీవించగలను ?

అవతారం : లాభంలేదండీ. వెళ్ళారు మూడ్‌లోకెళ్ళిపోయారు. ఏమిటి చెయ్యటం ?

గోపాలా : ఆ జేబులో గంట తగలడుతుందన్నావుగా, తీసి వాయించు.

( అవతారం భట్టు జేబులోని గంటతీసి చెవుల దగ్గర గణగణ మ్రోగిస్తాడు. లాబం వుండదు )

అవతారం : అయిపోయింది బాబూ ! అంతా అయిపోయింది. గంట దెబ్బకి కూడా మించిపోయారంటే కనీసం రెండు గంటలగ్గానీ ఈ లోకంలోకి రారు. నే వెళ్ళొస్తా ! కాస్సేపయ్యాక పాలుగాని, హార్లిక్స్ గాని పట్టండి పాపం.

గోపాలా : రేయ్ చర్మం వలుస్తా. వీడిని నాకంటించి, నువ్వు తప్పుకోవాలనా ! వీల్లేదు. వీడి సంగతి తేల్చి మరీ వెళ్ళు.

అవతారం : ఏం బాబూ ! రెండు వందల అద్దెని మూడువందలయాభై చేసింది నేనా ! కరెంటు, నీళ్ళు పేరుతో పదులు, పాతికలూ వసూలు చేసి దాచుకుంటున్నది నేనా ? ఫ్యానుకి అయిదు, రేడియోకి, టి.వికి పది, ఇస్త్రీ పెట్టెకి ఎనిమిది వసూలు చేస్తున్నారే ! అవన్నీ తీసుకుంటున్నప్పుడు ( భట్టుని చూపిస్తూ ) ఇదీ భరించాలి. తప్పదు. వస్తామరి.

గోపాలా : ఒరేయ్ అవతారం ! నీకు పుణ్యం వుంటుంది. వీడిని పంపించి నువ్వెళ్ళరా ! నాదసలే బలహీనపు గుండె.

అవతారం : అదంత తేలిగ్గా ఆగదులేండి. ( రెండు క్షణాలు ఆలోచించి ) సరే ఒక పని చేద్దాం.

గోపాలా : ఏవిటదీ ?

అవతారం : ఇందాకా మీరేదో నిద్రొచ్చే మాత్రన్నారు. ఏంటది ?

గోపాలా : ' కుంభకర్ణ గుళిక '

అవతారం : అద్గదీ, అదొకటి తగిలించి కాసిన నీళ్ళు కొట్టండి. తర్వాత చూసుకుందాం.

గోపాలా : మంచి ఆలోచన ! కాని వెయ్యటం ఎలా ?

అవతారం : మీరు మాత్ర పట్టుకురండి చెప్తా !

భట్టు : ( పెద్దగా అరుస్తూ ) కృష్ణ నిన్నునేను నమ్మను. నువ్వు పాండవ పక్షపాతివి. ( జుట్టు పీక్కుంటున్నాడు. ఆచార్యులు ఒక చేత్తో మాత్ర మరొక చేత్తో మంచి నీళ్ళ గ్లాసుతో వచ్చాడు )

అవతారం : ఆ గ్లాసు నాకిచ్చి మీరటుగా రండి. ఆయన నోరు తెరవంగానే మాత్ర వేసెయ్యండి. ఏం ! భట్టుగారూ, భట్టుగారూ దున్నపోతు ( అని పెద్దగా అరిచాడు )

భట్టు : ఆ ...(అంటూ నోరు తెరిచాడు. ఆచార్యులు మాత్ర నోట్లోకి విసిరేశాడు. అవతారం నీళ్ళు నోట్లో పోశాడు ) ఏమీ ! ఏమైనది ! నాకేమీ చేసితివి ? మైకముగా యున్నది.

గోపాలా : ఏమియునూ చేయలేదు. కాస్సేపు నిద్రించండి. వీడికి ఇల్లిస్తే. నేను ఇంకో ఇల్లు చూసుకోవాలి.

భట్టు : నా కేదియో అగుచున్నది నిద్ర ముంచుకొస్తున్నది.

( ఆవలిస్తూ స్టేజీకి  అడ్డంగా పడుకున్నాడు అవతారం, ఆచార్యులు భట్టుకి చెరో వైపునా కూర్చున్నారు )

గోపాలా : అబ్బ ప్రాణం ఎంత హాయిగా వుంది. కాస్సేపట్లో ఎంత ఆగం చేశాడు – వీడిల్లు బంగారంగాను.

అవతారం : అంతేనండీ ! డబ్బు కావాలనుకుంటే యివన్నీ భరించాలి. తప్పదు.

( అంతట్లో వెంకట్రావు ప్రవేశించాడు. వస్తూనే భట్టు పైకి వంగి పరీక్షగా చూసి, ఆచార్యులుతో....)

వెంకట్రావు : ఎంతసేపయింది ప్రాణంపోయి ! పాపం మనిషి చూడబోతే ఆరోగ్యంగానే వున్నాడు.

అవతారం : ఆయన చావలేదండీ బాబూ !

వెంకట్రావు : మరి ?

గోపాలా : ఏంబాబూ ! పడుకున్న ప్రతీవాడు చచ్చినట్టే లెక్కా .

అవతారం : ఆయన ఇపుడే  కురుక్షేత్రం పూర్తి చేసి కునుకు పట్టించుకున్నారు ఇంతకీ తమరెవరు ?

వెంక : ఏం చెప్పాలా ?

గోపాలా : ఇది మరీ బాగుంది. సరాసరి ఇంట్లోకొచ్చిందిగాక చెప్పాలా, గిప్పాలా అంటావ్ ?

అవతారం : బాబూ చూడబోతే ( భట్టుని చూపిస్తూ ) ఇదే బాపతులా ఉంది.

వెంక : నేనెవరో చెబితే గుండె పగిలి ఛస్తారు.

అవతారం : అయితే డాక్టరుగారి చెవిలో చెప్పండి.

గోపాలా : ఇన్ని మాటలెందుకు ! నాపేరు గోపాలాచార్యులు. ఈ ఇంటికి  ఓనర్ని. తమకేం కావాలో త్వరగా చెప్పి వెళ్ళండి.

( వెంకట్రావు మొహంలో రంగులు మారాయి )

వెంక : ఇల్లు అద్దెకి కావాలండి.

అవతారం : అద్దెకిల్లు కావాల్సినవాడివి, అలాగేనటయ్యా మాట్లాడేది.

గోపాలా : ఇలాంటివాళ్ళే వచ్చాక ఇక అనవసరం. బాబూ ఇల్లు యిచ్చేశాం. వెళ్ళిరండి.

వెంక : ఎంతకిచ్చారు ?

అవతారం : లక్షన్నరకమ్మేశాం. నీకెందుకయ్యా !

వెంక : అందుక్కూడా మీరు సమర్దులే.

( అంతలో ప్రజాపతిరావు ప్రవేశిస్తాడు )

ప్రజాపతి : ఆచార్యులుగారూ ఆ తాళం కాస్త ఇటు పడెయ్యండి. మాయావిడిని తీసుకొొచ్చాను.

అవతారం : పశువుల డాక్టర్ గారొచ్చారండీ !

గోపాలా : ( తాళం చెవి అందిస్తూ ) ఇల్లు మీకింద ఖాయం చేస్తున్నాం. మీ పోర్షన్ చూసుకుని అడ్వాన్స్ ఇచ్చి వెళ్ళండి.

వెంక : ( ప్రజాపతిరావుతో ) అద్దె ఎంతండీ ?

ప్రజాపతి : మూడు వందల యాభై. మూడు నెలల అడ్వాన్స్

అవతారం : అంతేకాదు. రెండు నెలల అద్దె నా ఫీజు.

వెంక : మూడువందల యాభయ్యా ?

గోపాలా : అయ్యా, ఇవన్నీ మీకనవసరం మాస్వవిషయాలు, మా ఇల్లు , మా ఇష్టం. వెళ్ళిరండి.

వెంక : కానీ, ఈ ఇంటి యజమాని నుటయాభై కిమ్మని చెప్పిన మాట వాస్తవమేగా ?

( గోపాలాచార్యులు, అవతారం మొహాల్లో ఆందోళన కన్పించింది )

గోపాలా : ఆ విషయం మీకెలా తెలుసు ? మీరెవరు ?

ప్రజాపతి : ఏమిటి ! ఈ డాక్టరు అసలు ఓనర్ కాదా ? అయితే అసలు యజమాని ఎవరు ?

వెంక : ఆ ప్రశ్నకి సమాధానం నే చెబుతా ! అసలు యజమానిని నేనే. పేరు వెంకట్రావు – వచ్చింది బొంబాయినించీ !

అవతారం : అంతా అబద్దం. బాబూ చూడబోతే మనకన్నా ముదురు కేసులా కన్పిస్తున్నాడు.

గోపాలా : ఏమిటి ! నువ్వు అసలు యజమానివా ! బొంబాయినుంచి వచ్చావా ! మనిషి చూస్తే దుక్కలా వున్నావ్ ! కష్టపడి పన్జేసుకోలేవూ ! పిచ్చి పిచ్చి వేషాలు మాని, మర్యాదగా బయటికి నడు.

వెంక : ది సీజ్ టూమచ్. నన్నింత  అవమాం చేశారు కాబట్టి, మీ  ఇద్దర్ని కటకటాల వెనక్కి పంపకపోతే  నా పేరు వెంకట్రావూ కాదు, నా వూరు బొంబాయి కాదు సరే ! ఇంతకీ మీకు  ఋజువు కావాలి. అంతేగా !

గోపాలా : అవును. నువ్వు చనిపోయిన  జనార్దనరావుగారి అబ్బాయి  వెంకట్రావువేనని రుజువు ఏమిటి ?

(వెంకట్రావు జేబులోంచి వుత్తరం తీసి ప్రజాపతిరావుకిస్తూ )

వెంక : కాస్త ఈ ఉత్తరం చదివి,  దీన్ని ఎవరు ఎవరకి వ్రాశారో చెప్పండి.

ప్రజాపతి : ( ఉత్తరం చదివి ) గోపాలాచార్యులు అనే వ్యక్తి జనార్దనరావుగారి కుమార్డు వెంకట్రావు అనే వ్యక్తికి వ్రాయబడిన ఉత్తరం, ఇంటి పన్ను 750 రూ ।।లు కట్టినట్లు తెలియబరుస్తూ రాశారు.

అవతారం : బాబూ – ఇంకనవసరం  – వారి కాళ్ళు కళ్ళకద్దుకోండి.

వెంక :  ఇప్పుడయినా నమ్ముతారా ! ఇంకా రుజువుల, సాక్ష్యాలు  కావాలా ?

గోపాలా : బాబూ తప్పయిపోయింది. మీ తండ్రిగారిని  తప్ప మిమ్మల్ని  ఎరుగక అలా వాగేశాను.  క్షమించండి.

ప్రజాపతి : అంటే అసలు యజమాని మీరన్న మాట సార్ ఈ ఇల్లూ...

వెంక : మీరు కాసేపు  జరగబోయే నాటకాన్ని చూస్తూ నిలబడండి. ( ఆచార్యులతో ) మా నాన్నగారు నూటయాభైకిమ్మంటే  నువ్ మూడొందలయాభై  ఎందుకు చెప్తున్నావ్ ?

గోపాలా : అయ్యా మీరు సావధానంగా వింటే అన్నీ చెబుతాను. ఇంటిపన్ను పెంచారు. వాటర్ ఛార్జెస్ పెరిగినాయి.  మీరూ ఉద్యోగాల మీద బ్రతికేవారు. మీ మేలు ఆలోచించి నేనే...

వెంకట్రావు : షటప్. నాకు 750 రూపాయలు టాక్సు కట్టినట్లు రాశావు నిజమేనా ?

అవతారం :  కట్టేవుంటారండీ ! డాక్టరుగారు నిప్పులాంటోళ్ళు.

వెంకట్రావు : ఇద్దరికిద్దరూ  తోడు దొంగలు. ఉదయం మున్సిపల్ ఆఫీసుకెళ్ళి చూసొచ్చాను. నువు కట్టింది నూటయాభై మాత్రమే !

అవతారం : ఆ ఆరొందలు తొక్కేశారన్నమాట.

గోపాలా : బాబూ ! ఇన్ని మాటలెందుకు. తప్పయిపోయింది. కక్కుర్తి పడ్డాను. క్షమించండి.
వెంకట్రావు : ఆ మాటంటానికి సిగ్గులేదు. వయసులో పెద్దవాడివి. ఇంకా దుక్కలావున్నావ్.
కష్టపడి పన్జేసుకోకూడదు – ఇలా ప్రజలని మోసం చేసేకన్నా !
అవతారం : మా బాగా చెప్పారండీ....
వెంకట్రావ్ : నువ్ నోర్మూయ్ – నువ్ సామాన్యుడివి కాదు. మధ్యవర్తి రూపంలో వున్న
పిశాచివి.
ప్రజాపతి : సార్ ! ఇంతకీ ఇంటి సంగతీ ...!
వెంకట్రావ్ : ( ఆచార్యులతో ) కమాన్ – నా ఇల్లు నాకు ఖాళీ చేసిచ్చేయ్. గంట
టైమిస్తున్నాను. లేకపోతే నీ సామాన్లు రోడ్డు మీద పారేస్తాను.
గోపాలా : మీరలా అంటే ఎలా ! కాస్త వ్యవధి ఇవ్వండి. ఖాళీ చేసి వెళ్ళిపోతాను. నాకూ
ఇల్లు దొరకాలి గదా !
వెంకట్రావ్ : నా కనవసరం. అవన్నీ నేను వినను. గంటలో నా ఇల్లు నాక్కావాలి. లేదా
అసలు ఈ ఇంటిని అమ్మిపారేస్తాను. ప్రాణం హాయిగా వుంటుంది.
( అవతారం ముందుకొచ్చి జేబులో బీడీని తీసి వెలిగించి )
అవతారం : కంగారుపడకండి. ఆపద్బాంధువుడిని, అనాథరక్షకుణ్ణి నేనున్నాను. ఇల్లు
అద్దెకివ్వాలనుకున్నా, అమ్మేయాలనుకున్నా నేనున్నాను. ఇద్దరూ నాకు
దణ్ణమెట్టుకోండి. మీమీ కష్టాలు గట్టెక్కుతాయి.
వెంకట్రావు : అంటే నీ ఉద్దేశ్యం ?
అవతారం : చాలా సింపుల్. డాక్టర్‌గారికి అద్దెకిల్లు చూపబడను. కాని మూడు నెలలు అద్దె
నాకు ఫీజుగా చెల్లించాలి, మీరు ఈ ఇల్లు అమ్మేయాలనుకుంటే మాంచి బలిసిన
గిరాకీని పట్టుకొస్తాను. అమ్మగా వచ్చిన మొత్తంలో ఒన్ పర్సంట్ నా ఫీజు.
వెంక : ఛస్తే నీకు పైసా ఇవ్వను. అసలు నీ సహాయమే నా కక్కర్లేదు.
అవతారం : సరే, అదీ చూస్తాను. నన్ను కాదని ఈ ఇంటిని ఎలా అమ్ముతారో చూస్తాను.
బాబూ ఇది బొంబాయి కాదు. అది గుర్తుంచుకోండి. ఈ ఇంట్లో
దయ్యాలున్నాయనో, ఈ ఇంట్లో వున్న వారికి మగతనం పోతుందనో పుకార్లు
పుట్టిస్తాను. తర్వాత మీ యిష్టం !

వెంకట్రావు : అమ్మవెధవా ! ఎంతకు తెగించార్రా మీరు ?

అవతారం : ఏవనుకున్నారు. ఈ అవతారంగాడంటే ! సాక్షాత్తు విష్టుమూర్తులవారు నన్ను పిలిచి – రేయ్ అబ్బాయ్ భూ లోకంలోకెళ్ళి ! ఈ విధంగా ప్రజలకి సేవ చేసుకో అని చెప్పి, అవతారం అని పేరెట్టి మరీ పంపాడు తెల్సునా ?

వెంకట్రావ్ : తెల్సురా – తెల్సు. విష్ణుమూర్తులవారు నిన్ను పంపారనీ తెలుసు ఇక్కడ ప్రజలకు నువు చేస్తున్న సేవ గురించీ తెలుసు. అందుకే నిన్ను స్వయానా తీసుకెళ్ళటానికి వారే వచ్చారు (అంటూ పడుకున్న నారాయణభట్టు పైకివంగి ) స్వామీ, వీరిద్దరినీ మీలో ఐక్యం చేసుకోవటానకి ఈ రుజువులు, సాక్ష్యాలు చాలా ! ఇంకా కావాలా ? ( నారాయణభట్టు చటుక్కున లేచి నించున్నాడు )

భట్టు : చాలు, వాళ్ళ గోతులు వాళ్ళే తవ్వుకున్నారు.

గోపాలా : అంటే ఈయన, మీ తాలూకు మనిషేనా ?

వెంకట్రావు : కాదు, ఆయన పోలీసు డిపార్ట్మెంటు నుంచి వచ్చారు. ఇంటికోసం – మందుకోసం కాదు. మీ కోసం.

( అవతారం మెల్లిగా జారుకోబోతాడు. భట్టు అవతారాన్ని, గోపాలాచార్యులని చెరో చేత్తో పట్టుకుని )

భట్టు : మాయమాటలు చెప్పి, దొంగలెక్కలు వ్రాసి, నాటు మందులు – పిచ్చి మందులు ఇచ్చి, అటు ప్రజలని ఇటు ఇంటి యజమానిని మోసం చేసినందుకు ఈ డాక్టర్ని, ఈయనతో ప్రతి విషయం లోనూ చేయి కలిపినందుకు, ఈ అవతారాన్ని అరెస్ట్ చేస్తున్నాం. ఏయ్ కానిస్టేబుల్... ( అని పిలవగానే, అంభారావు ప్రవేశించి శాల్యూట్ చేసి నిలబడతాడు )

అవతారం : ఇతగాడు కానిస్టేబులా ? మరి జనాభా లెక్కల వాడినన్నాడు.

అంభారావు : అలా అని చెప్పి నీ గుట్టంతా లాగేను. పదండి – పదండి. జైల్లో ఎంచక్కా ఢంకా పలాసు ఆడుకుందాం. ( నారాయణభట్టుతో ) పదండి సార్ !

గోపాలా : పెద్దముండావాడిని క్షమించండి ( వెంకట్రావుతో )

అవతారం : చిన్న వెధవని మన్నించండి.

వెంకట్రావు : మీ ఇద్దర్నీ క్షమించే ప్రసక్తే లేదు. మీమీ అవసరాలకు, మారు మాటు చెప్పి మోసం చేస్తూ అమాయక ప్రజలను ఇబ్బందుల పాల్జేస్తున్నారు. మీలాంటి

చీడపురుగులు వుండాల్సింది ఇక్కడ కాదు. శ్రీకృష్ణ జన్మస్ధానంలో – వీళ్ళిద్దరినీ తీసుకుపదండి. రిపోర్టు వ్రాసిస్తాను.

( నారాయణభట్టు, అంభారవు, గోపాలాచార్యులుని, అవతారాన్ని బయటకు తీసుకువెళ్తారు )

ప్రజారావు : ఇంతకీ ఇల్లు అద్దెకిస్తారా ? అమ్మేస్తారా ?

వెంకట్రావు : మీకిల్లు అద్దెకివ్వాలి. అంతేగా. మీలాంటి వాళ్ళ ఆదుర్దాలు, తొందర్లూ అవతారంలాంటి మధ్య వర్తులను ప్రోత్సహించి, బాగు చేస్తున్నాయి. ఈ రోజున దేశంలోని మూడొంతుల అరిష్టాలకు కారణం – మధ్య మనిషి. అన్ని రంగాల్లో వీళ్ళు అడ్డుగోడల్లా నిలబడి, దేశాభివృద్ధికి అడ్డుపడుతున్నారు. మీరు ఒక్క క్షణం ఆలోచించండి. ఇల్లు కావాలంటే యజమానితో ముఖాముఖీ మాట్లాడండి. అంతేగాని అవతారాలని తలెత్తనియ్యకండి. రండి. మనం మాట్లాడుకుందాం. ( అంటూ ప్రజాపతిరావు భుజంమీద చేయి వేసి నడుస్తూండగా – తెర )

( సమాప్తం )